# 13. కృష్ణవేణి

ఆదివారం ఉదయం తీరుబడిగా నిద్రనుంచి లేచి బయటికి వచ్చేటప్పటికి ఎదురింటి గుమ్మంలోవున్న కృష్ణవేణి నా కంటబడ్డది. ఆమెను చూడటం నాకది క్రొత్త కాకపోయినా, ఆనాడుమాత్రం యీ రెండు సంవత్సరాల్లోనూ, మారిన ఆమె రూపం నా కళ్ళయెదుట ఒక నూతనవ్యక్తిని ప్రదర్శించింది. ఆమె ముందు ముందు ఇంత రూపురేఖలతో విరాజిల్లుతుందని పూర్వమే ఒక విధంగా నా ఊహా ప్రపంచంలో సృష్టించుకున్నాను; కాని యీ కృష్ణవేణి, నా కాల్పనిక కృష్ణవేణి మీద అనేకరెట్లు అందంగా వుందనేందుకు సందేహం లేకపోయింది.

కృష్ణవేణి నన్ను చూసి మందహాసంచేసి ఇంట్లోకి వెళ్ళిపోయింది. భర్తను కోల్పోయిన కృష్ణకు నాలో నేనే సానుభూతిని చూపాను.

కాఫీ సేవించాక గదిలోజేరి పత్రిక తిరుగవేస్తున్నాను. పత్రిక మీది దృష్టి కిటికీలోనుంచి చొరుచుకొని ఎదురింట్లోకి జొరబడుతోంది! కృష్ణవేణిలో ఏదో దేవతామూర్తి ప్రతిఫలించి నన్ను పలకరించినట్టవుతోంది. ఇంత సులభంగా నన్ను ఆకర్షించుకో గలిగిన కృష్ణలో ఏ అమానుషశక్తి ఇమిడివుందో! పత్రికల్లో కనిపించే సినిమాబొమ్మలకు ఆమెపోలికలు– మచ్చుకొక్కటయినా వుందేమోనని చూశాను. ఎక్కడా లేదు. ఒకవేళ వున్నా నా కప్పుడు కన్పించి వుండదు.

ఒళ్లంతా కళ్ళుచేసుకొని ఆమెను చూడటంలో నాకు ఎంత మనశ్శాంతి! ఏవో వెర్రిఊహల్తో నాకు నేను ఊహాసౌధాల్ని నిర్మించుకొని ఎంత ఆనందించాను! ఆమెను ఎప్పుడన్నా కలుసుకోగలుగుతే నా హృదయాన్ని విప్పి చెప్పటానికి గాను కావలసిన

సంభాషణలను అనేక విధాలుగా ఊహించి వినోదించాను. అంతా చిరాకుగా కన్పించింది. బహుశా మొదటి చూపుల్లోనే సైరంధ్రిని ప్రేమించి, తపించిన కీచకుడి అవస్థ అప్పుడు నాకు బాగా అర్థమయి వుంటుంది.

ఆనాడు మధ్యాహ్నం కృష్ణ, శాంతతో గవ్వలాడేందుకు ఇంటికి వచ్చింది.

"బావగారున్నారా?" అన్న కృష్ణ కంఠం తగ్గుస్థాయిలో నాకు విన్పించింది. నేను గదిలో జాగ్రదావస్థలోనే వుండి ఆమె మాటల్ని ఆలకిస్తున్నాను.

"ఫర్వాలేదులే- పడుకున్నారు" అని మా ఆవిడ సమాధానం చెప్పాక, ఇద్దరూ, లోకాభిరామాయణ పారాయణలో పడ్డారు.

నేనుమాత్రం నిద్రపోతూవున్నట్టు కళ్లుమూసి, చెవులకు మాత్రం పని కల్పించాను కాని, వాళ్ళ మాటలేవీ నాకు మాత్రం విన్పించాయికావు.

ఆ రాత్రి మా ఆవిడ దగ్గర యీ ప్రస్తావన తెచ్చాను.

"శాంతా! వాళ్ళ కృష్ణ వచ్చినట్టుందే-"

"ఊఁ"

"ఎన్నాళ్లయింది?"

"వారమవుతుంది."

"పాపం! భర్త చనిపొయ్యాడు!"

"మరే! డబ్బుకు ఆశపడి వాళ్ళమామ చేసిన సంబంధం అది! కాపరానికి వెళ్ళిన ఏడాదికే ఆ ముసలిమగడు చచ్చాడు."

"ఆమె విచారంగాలేదేం?"

"విచారందేనికి? అల్లాటి భర్త బతికివున్నా ఒకటే- చచ్చినా ఒకటే. వాళ్ళ నాయనమ్మ ఒక్కతే తప్ప ఇతర దిక్కు కూడాలేదు."

నేనేమీ మాట్లాడకుండా, కృష్ణను గూర్చి వివిధ రీతులైన ఊహావ్యూహాల్ని పన్నుకున్నాను. నాలో ఆమెమీద ప్రేమ ఉందోలేదోకాని, 'వాంఛ' మాత్రం దృఢపడ్డది. మానవుడు తన కోరికను తీర్చుకునేందుకు ప్రయత్నించటం చాలా సామాన్యమైన విషయం- నేనుకూడా ఇందుకు ప్రయత్నించాను. అప్పటిలో ఈ పని పాపమని కాని, అవినీతిదాయకమైనదని కాని నాకు తోచలేదు.

రెండు రోజులు గడిచాక శాంత, 'మా చెల్లెలు కనేనెలలు నేను మా పుట్టింటికి వెళ్తా'నంది.

శాంత లేకపోవటమే - నాకు కావలసింది. నా కార్యసిద్ధి సమస్య సగంతీరింది.

"ఎవరికో పురుడుపొయ్యటమే కాని - నువ్వు పోసుకోటం లేదుగా."

"చాల్లెండి" అని మూతిబిగించుకొని శాంత వెళ్ళిపోయింది.

## 2

శాంత ఇంట్లోలేకపోవటం నాకు మంచి అవకాశమే అయినా, కృష్ణ మా ఇంటికి రాకపోవటం నాకు చాలా కష్టమనిపించేది.

దీనికో పన్నాగం ఆలోచించి, కృష్ణ వింటూవుండగా– "శాంతా! అన్నంవడ్డించు" అని పెద్దగా కేకవేశాను.

నా పాచిక పారింది. గంట గడిచాక, దగ్గరిగా వేసివున్న తలుపును నెట్టుకొని, కృష్ణ ఇంట్లోకి వచ్చి, "శాంతక్కయ్యా!" అని పిలిచింది.

"ఊ!" అని సన్నటి గొంతుకతో, గదిలోనుంచి నేను కూనిరాగం తీశాను.

ఆమె తొందరగా గది తలుపు తీసి గదిలో ప్రవేశించి, నన్ను చూసి ఆశ్చర్యపడి ఒక్క నిమిషం అల్లాగే నిలబడి, మళ్ళీ వెనక్కు తిరిగింది.

"కృష్ణా!" అన్నాను ఒణుకుతూన్న గొంతుకతో. ఆమె ఆగింది.

ఆమెతో మాట్లాడాల్సిన మాటల్నీ, సరసాల్నీ ఇదివరకొక వందసార్లు బుర్రలో గట్టిగా భద్రపరుచుకున్నాను. కాని ఇప్పుడు అవ్వన్నీ పునాదుల్తో సహా మాయమయ్యాయి. ఏదో వెధవ భయం వల్ల గొంతులోనుంచి మాటరాదు!

నా మౌనాన్ని ఆమె నెట్టేసి "ఎందుకు?" అంది.

"అప్పుడే వెళ్తున్నావేం?"

"అక్కయ్య లేదూ?"

"వస్తుందిలే – కూర్చో."

"వస్తే – బావగారు ఇంత ధైర్యంగా వుంటారా?" – ఆమె ఫకఫకా నవ్వింది. ఆమె నవ్వులో నలిగి నేను పారవశ్యత చెందాను.

"బావగారి ధైర్యాన్ని పరీక్షిద్దువుకాని మరి! కూర్చో."

ఆమె కూర్చుంది; నేను లేచాను.

"ఎక్కడికి?"

"ఇప్పుడే తలుపువేసివస్తా–"

"చాలా ధైర్యస్థులు."

ఆమె ఫక్కున నవ్వినా విన్పించనట్టు వెళ్ళి తలుపు గడియపెట్టాను.

"ఆడదాంతో మాట్లాడేందుకే భయపడే బావగారు..."

"నాకా? భయమా? ఎందుకు?"

"మరి తలుపువెయ్యటం దేనికి?"

"ఎవరన్నా చూస్తే బాగుండదు."

"ఎందుకని?"

ఏం సమాధానం చెప్పను?

"పెద్దదానివి అయినకొద్దీ, చిన్నప్రశ్నలు ఎక్కువౌతున్నాయ్!"

"కాదు; పెద్దవాళ్ళవుతున్న కొద్దీ చిన్నచేష్టలు ఎక్కువౌతున్నాయి!"

ఇద్దరం కొంచెంసేపు నిశ్శబ్దంగా వూరుకొన్నాం.

"నేను వెళ్తా"నంటూ లేచింది.

నా వలపునంతా దృష్టిలో ఇమిడ్చి ఆమె వైపు చూశాను కాని, ఆమె మాత్రం నిర్వికారంగా నిలబడ్డది.

లేని ధైర్యంతో, ఎంతో బాధను ఇమిడ్చి "కృ-ష్ణా!" అన్నా.

"ఏం కావాలి - బావగారూ?"

"నువ్వు-"

ఆమె చాలా సిగ్గుపడ్డది; అమితోద్రేకంతో ఆమె చెయ్యిపట్టుకున్నాను.

"శాంత వుండగా - నేను కూడా ఎందుకు?"

నేనేమీ సమాధానం చెప్పలేదు. ఆమె వ్రేళ్లను నా వ్రేళ్లతో కీలించాను. ఆమె మౌనంతో నా వేషాల్ని చూస్తూ శిలా ప్రతిమలాగు ఊరుకొంది. ఆమె వెచ్చని హృదయంలో నా తలదాచుకొని, ఆమె తల నిమురుతూ, "కృష్ణా! నువ్వు నా దానివి" అన్నాను. ఆశాజ్యోతితో మిళితమైన ఆమె కళ్లు నన్ను బంధించి, సర్గసౌఖ్యాన్ని చూపాయి. అల్లా ఎంతసేపు ఆమె ఏకాంత సౌఖ్యాన్ని నేను అనుభవించానో కాని గడియారం నాలుగు గంటలు కొట్టాకకాని 'నేను' తిరిగి 'నేను' అవలేకపొయ్యాను.

## 3

కృష్ణతో ఇల్లా గడిపిన రెండు మాసాలూ చాలా గుట్టుచప్పుడుగా పరుగెత్తాయి. 'రంకూ, బొంకూ దాగద'న్నారు. అందులోనూ శాంత నన్ను పట్టుకోవాలనే ప్రయత్నం మీద కూడా వుంది; పట్టుకొంది.

"పరువూ, మర్యాదా కాపాడుకునేందుకుకైనా ప్రయత్నించండి. కృష్ణతో మీరు స్వేచ్ఛగా ప్రవర్తిస్తే నేను ఓర్వలేను. లోకం సహించలేదు. కృష్ణను నేను ప్రేమిస్తున్నాను.

ఆమె అంటే నాకు ఎంతో గౌరవం. అయినా ఆమె ప్రవర్తన నాకు బాగా లేదు. చదువుకున్నవాళ్లు, విజ్ఞానవంతులూ అయిన మీరిల్లా ఉపేక్ష చేస్తే లాభంలేదు." శాంత చెప్పిన మాటలకు పోలీసు అధికారిముందు నిలబడ్డ దొంగలాగు నిలబడ్డాను.

ఆమె మళ్ళీ అందుకుంది. "కృష్ణ అందమే మిమ్ము ఆకర్షించవచ్చు; కాని ఆమె అందమే ఆమెకు శత్రువై ఆమెను పాడుచేస్తోంది. మీలో ఇల్లాటి మార్పు చాలా శోచనీయం. నేను మీ భార్యను కాబట్టి మీకు సలహాను ఇవ్వటానికి నాకు అధికారం వుంది."

శాంత చెప్పింది అక్షరాలా చెవిన వేసుకునేవాణ్ని; నా మనో బలాన్నంతట్నీ ఉపయోగించి, ఆమె సలహాను అనుసరిద్దామని ప్రయత్నించేవాణ్ని. కాని అది నాకు సాధ్యమయ్యేదికాదు.

ఆనాడు రాత్రి కృష్ణకూడా చెప్పింది; "అక్కయ్యను అనవసరంగా కష్టపెడుతున్నారు. ఆమె ఏం తప్పుచేసింది? కాకుల్ని కొట్టి గద్దలకు వెయ్యటం దేనికి? ఇంతకూ మీ కాపరాన్ని చెడగొట్టిన నాది తప్పు. మనను చూచి నలుగురూ నవ్వుతున్నారు! తెలియకచేసిన నా తప్పుకు నన్ను క్షమించండి."

కృష్ణ చిన్నపిల్లలాగు వలవలా ఏడ్చింది. నాకు రెండు వాడి కత్తులూ ఒకేసారి గుచ్చినట్టయింది.

నా మౌనాన్ని చూచి ఆమె మళ్ళీ చెప్పింది. "మీకు కూడా స్వార్థం వుండరాదు. ఆమె మీ ధర్మపత్ని: అగ్నిసాక్షిగా వివాహమాడిన మీ భార్యను సౌఖ్యపెట్టటం మీ విధి! మీరు చేసేపనిని ఏ గృహిణికూడా సహించలేదు. నేనెల్లాగూ బతికి చెడ్డదాన్ని. మీరు మాఇద్దర్నీ సౌఖ్యపెట్టాలనుకుంటే– నన్నొక తోబుట్టువుగా చూచుకోండి. నేను చేసిన తప్పుకు భగవంతుడే నన్ను శిక్షిస్తాడు."

ఆమె హృదయంలోనుంచి వెలువడ్డవేనా యీ మాటలు? ఆమె మాటలకు ఏ కత్తులకున్న పదును వుందోకాని నా హృదయంలో కనపడని గాయమయింది! కృష్ణలాగు స్వార్థాన్ని విడిచి ఇలా ఇతరుల కష్టాలకు సానుభూతిగా కన్నీటిని కార్చేవ్యక్తిని నేను వినలేదు; కనలేదు! శాంతకు తెలియకుండా ఆమె ఎంత త్యాగం చెయ్యగలిగింది! కృష్ణ కన్నీటితో నా హృదయం తడిసిపోయింది.

"కృష్ణా! నిన్ను విడువలేను" అన్నాను భగ్న స్వరంతో.

"మీ జాతికి నీతిలేదు. మిమ్మల్నే నమ్మిన మీ భార్యనే అల్లా అన్యాయం చేస్తే నా మాటేమిటి? మీ భార్యను గూర్చి మీరు ఈ మాత్రం త్యాగంచెయ్యలేరూ?"

కృష్ణ మాటలకు నేను అప్రయత్నంగా అశ్రువుల్ని రాల్చాను.

"మీరీ ఒక్కపనీచేస్తే మీగురించి రెండుప్రాణులు బాధపడకుండా వుంటాయి"- కృష్ణ నా గడ్డం పట్టుకొని బ్రతిమాలసాగింది.

"మీరు నన్నిప్పటినుంచీ, చెల్లిలిగా చూసుకుంటానని ప్రమాణం చెయ్యండి-"

"చేతకాదు."

"మీరింత దుర్బల హృదయు లనుకోలేదు."

కృష్ణకన్నీటి బిందువుల్లో చంద్రుడు ప్రతిఫలించి, వాటిని ముత్యాల్లాగు మెరిపింప జేస్తున్నాడు.

"కృష్ణా! నేనేం తప్పుచేశానని నన్నిల్లా శిక్షిస్తున్నావు?"

ఆమె నవ్వి అన్నది; "నేను శిక్షించేదేమిటి? ఈ లోకంలో నేరంలేని శిక్షలేలేవా? నేనేం తప్పుచేశానని నా జీవితం అంధకార బంధురమయింది? నేనేం తప్పుచేశానని లోకం నా వైపు తిరిగి వికటాట్టహాసం చేస్తోంది! ఈ శిక్షల్ని అనుభవించి తీరాలి; విజ్ఞానవంతులు మీతో చెప్పవలసిందేమీ లేదు-"

నాల్గవజాముస కోడి కూసింది. చంద్రుడు కొబ్బరిమట్టల్లోంచి తొంగిచూస్తూ మబ్బుల్లో మాయమౌతున్నాడు.

"ఇకనుంచి నేను మీకు చెల్లెల్ననే మాట గుర్తుంచుకోండి- ఇంక నేను వెళ్తున్నాను."

కృష్ణ లేచి నిలబడ్డది, నేనేదో మాట్లాడుదామని పొడిగొంతుకను సవరించు కొన్నాను; కాని ఆమె నానోటికి తనచేతిని అడ్డు పెట్టి, "ఇంకేం మాట్లాడవలసిన పనిలేదు" అని వెళ్ళిపోయింది.

అడుగంటిన ఆశలతో శిలాప్రతిమలాగు వెనుక నేను నిలిచిపొయ్యాను. స్త్రీ హృదయంలో అమృతానికీ, విషానికీ, కూడా తావుందని అప్పుడు నేను గ్రహించాను.

నాకు గడిచిన రోజులే మంచివిగా కన్పించేవి. నా మనోబలాన్నంతా ఉపయోగించి, గుండెను రాయి చేసుకొని, కృష్ణమీది వాంఛను పూర్తిగా చంపుకొన్నాను. క్రమేపీ శాంతకు కృష్ణమీద ద్వేషంకూడా పూర్తిగా పోయింది. వారిద్దరూ ఒక్క కడుపున పుట్టిన అక్కచెల్లెళ్ళలాగుండేవారు. ఎప్పుడూ ఏవేవో రహస్యాల్ని చెప్పుకునేవారు.

అశాంతి ప్రబలిన హృదయంతో, రాత్రులు నక్షత్రాల్ని లెక్కిస్తూ, ఏదో ఆలోచిస్తూ, నాలో నేనే దుఃఖిస్తూ ఏడునెలలు ఎల్లాగో గడిపాను. కృష్ణవైపు తలెత్తి చూచేందుక్కూడా సాహసించేవాడ్ని కాదు; ఒకవేళ చూస్తే, కడుపులో చెయ్యిపెట్టి కలచినట్టుండేది. మనోబలంతో ఎంత హృదయపరివర్తనైనా సాధ్యమౌతుందని నేను దృఢపరుచుకొన్నాను.

# 4

ఆ విషయం నాకు తెలియకపోలేదు. కాని, నేనేం చెయ్యగలను?

నెల రోజుల క్యాంపు విసుగు పుట్టించింది. నేను ఇల్లు జేరుకునేప్పటికి శాంత నవ్వుతూ నాకు ఎదురైంది. ఆమె అమాయక సంతోషం నాకు అవగాహన మవలేదు.

శాంత నన్ను చెయ్యిపట్టుకొని పక్కగదిలోకి తీసుకువెళ్ళింది; గదిలో మంచంమీద కృష్ణ పరుండివుంది. ఆమె ప్రక్కనే బిడ్డ నిద్రిస్తోంది. బహుశా కృష్ణ కుమార్తె అయి వుంటుందని సిగ్గుతో తలవొంచుకున్నాను.

శాంత నవ్వుతూ బిడ్డను పొత్తిగుడ్డల్తో ఎత్తి నాకు చూపింది; బిడ్డ మూడుమూర్తులా కృష్ణను పోలివుంది. బాలింతరాలు బరువైన కనురెప్పల్ని ఎత్తి, బాధతో మళ్ళీ మూసింది. కృష్ణ పాలిపోయిన ముఖంతో, బక్కచిక్కి, పక్కటెముకలు లెక్కించేందుకు వీలైన శరీరంతో నా సానుభూతిని సంపాదించగలిగింది.

సుయోధనుడు మయసభలో పడ్డ అవమానం కన్న, నన్నీ ఘట్టం ఎక్కువ వేధించింది. గదిలో ఏకాంతంగా కూర్చొని పశ్చాత్తాపపడ్డాను. కన్నీరుకార్చాను.

ఆ సాయింత్రం డాక్టర్ రెండు చేతుల్నీ పట్టుకుచెప్పాను: "మీకేం కావాలంటే అది ఇస్తాను; కృష్ణకు ప్రాణంపొయ్యండి."

ఆయన నవ్వుతూ, "మేము మందులిచ్చే వాళ్ళమే కాని ప్రాణాలు పోసేవాళ్ళం కాదు- పదండి చూద్దాం" అన్నాడు.

రోగిని పరీక్షించి ఏవేవో మాత్రలు ఇస్తూ, "ఈ రాత్రి గడవడం కష్టం" అని పెదవి విరిచి వెళ్ళిపొయ్యాడు.

ఏమీ పాలుపోక విషాదంతో శాంతా నేనూ కృష్ణ దగ్గర్నే కూర్చున్నాము.

గడియారం రెండు గంటలు కొట్టింది.

కృష్ణ కాంతిహీనమైన కళ్ళను తెరిచి శాంత చేతులు పట్టుకుచెప్పింది; "అక్కా! ఇంక లాభంలేదు; నాకే బతుకుతాననే ఆశలేదు; నేను క్షమించరాని తప్పుచేశాను; నన్ను క్షమించు–"

"రోగులు ఇల్లాటి గొడవల్నేనా పెట్టుకోవాల్సింది?" శాంత మెల్లిగా మందలించింది.

కృష్ణ కన్నీటితో సాగించింది. "నేను చనిపొయ్యే ముందు మరోమాట చెప్పాలి. అపవిత్రమైన యీ బిడ్డను పెంచాల్సిన బాధ్యత మీ ఇద్దరి మీదను వుంది. మా ముసలిది చనిపొయ్యాక నాకీలోకంలో మీ ఇద్దరికన్నా బంధువులు లేరు–"

శాంతకూ నాకూ కూడా కళ్ల నీళ్లు తిరిగాయి. “ఈ బిడ్డను నా బిడ్డగా చూచుకుంటాను కృష్ణా!” అన్న శాంత మాటలకు కృష్ణ ఆత్మ ఎంత ఆనందించిందో!

కృష్ణ గట్టిగా ఊపిరి పీలుస్తూ “అక్కా! ఎన్ని జన్మాలెత్తినా నీ మేలుకు కృతజ్ఞురాల్నవుతాను” అని ఏదో బాధతో, మా ఇద్దరిచేతుల్ని పట్టుకుంది.

దక్షిణదిశ కిటికీలోంచి చంద్రుడు అస్తమించబోతూ క్షీణకాంతుల్తో తొంగి చూస్తున్నాడు. మసిబారిన లాంతరు అదిరదిరి పడుతోంది.

గడియారం భయంకరంగా మూడుగంటలు కొట్టింది. చంద్రుడు తెల్లనికాంతితో అస్తమించాడు. పెనుగాలికి చెట్లకొమ్మలు టపాటపా కొట్టుకొన్నాయి. లాంతరు ఆరిపోతూ ఒక్కసారి పెద్దగా ప్రజ్వరిల్లింది; కృష్ణ మా ఇద్దరకూ నమస్కరించింది. గుంటలుపడ్డ ఆమె కళ్లనుంచి వచ్చే దీనదృక్కులు మమ్మ నిశ్చేష్టుల్ని చేశాయి. ఆమె యీ పాపభూయిష్ఠ ప్రపంచంనుంచి మరలి, శాశ్వతనిద్రలో నిమగ్నమయింది. ఆమె చల్లని చేతుల్ని మేము స్పృశింపలేకపొయ్యాం. బిడ్డ కెవ్వున కేకవేసింది.

శాంత బిడ్డను ఎత్తుకొని, “అమ్మాయికి కృష్ణపేరు పెడదాం” అంది.

ఈ తల్లీ కూతుళ్లను చూసిన నాకు ఆనందబాష్పాలు రాలాయి.